# సాక్షి కాకినాడ


మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024






**ఆరుగాలానికి ఆరు రుచుల స్వాగతం**

శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా ప్రతి ఒక్కరూ కోపాన్ని, ద్వేషాన్ని జయించి, ప్రేమతో ముందుకు సాగాలని పండితులు సూచిస్తున్నారు. - 2లో



**డెల్టాలకు నీటి విడుదల**

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 1,800, మధ్య డెల్టాకు 1,300, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

**రంజాన్ వేళలు**

| | ఇఫ్తార్ మంగళ (సా॥) | సెహరీ బుధ (ఉ॥) |
|---|---|---|
| రాజమహేంద్రవరం | 6.26 | 4.28 |
| కాకినాడ | 6.26 | 4.28 |
| అమలాపురం | 6.26 | 4.28 |

## న్యూస్‌రీల్

### జిల్లా ప్రజలకు కలెక్టర్ ఉగాది శుభాకాంక్షలు



కాకినాడ సిటీ: శ్రీ క్రోధి నామ సంవత్సరంలో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని కలెక్టర్ జె.నివాస్ ఆకాంక్షించారు. ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సూర్య కళామందిరంలో మంగళవారం ఉదయం 9 గంటలకు ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. సంప్రదాయ వేద పఠనం, పంచాంగ పఠనంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

### ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

కాకినాడ సిటీ: రానున్న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓ) విధులు సక్రమంగా నిర్వర్తించేలా పకడ్బందీ శిక్షణ ఇవ్వాలని మాస్టర్ ట్రైనీలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనీల శిక్షణనుద్దేశించి ఆయన మాట్లాడారు. పోలింగ్ ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద అనుసరించాల్సిన మెళకువలు, పోలింగ్ సామగ్రి కేటాయింపు, మే 13న పోలింగ్ నిర్వహణ, ఈవీఎం, వీవీ ప్యాట్‌ల పని తీరు, పీఓ, ఏపీఓ, ఇతర ఎన్నికల సిబ్బంది విధు లు వంటి అంశాలపై మాస్టర్ ట్రైనీలకు ఈ శిక్షణ ఇచ్చారు. అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 12, 13 తేదీల్లో పీఓ, ఏపీఓలకు, 15, 16 తేదీల్లో ఓపీఓలకు శిక్షణ నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈవీఎం, వీవీ ప్యాట్ పని తీరు, పీఓ డైరీ ప్రాధాన్యం, మాక్ పోలింగ్, ఏజెంట్ల నియామకం, ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం, ముగింపు దశలో అనుసరించాల్సిన విధానాలు, పోలింగ్ సామగ్రి తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అవగాహన కల్పించారు.

### నేడు తలుపులమ్మ తల్లి నేత్ర దర్శనం

తుని రూరల్: లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారి నేత్ర దర్శన కార్యక్రమాన్ని మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఉగాది పర్వదినం కావడంతో ఉదయం 7.22 గంటలకు నేత్ర దర్శనంతో అమ్మవారి దర్శనాలను లాంఛనంగా పునరుద్ధరిస్తున్నామని ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు సోమవారం తెలిపారు. గత ఏడాది జనవరిలో రూ.15 కోట్లతో అమ్మవారి ప్రధాన గర్భాలయం, మహామండపం, తొమ్మిది అంతస్తుల రాజగోపురం పనులు చేపట్టారు. అప్పటి నుంచీ మెట్ల మార్గంలో అమ్మవారి పెద్ద విగ్రహం వద్ద బాలాలయం నిర్మించి భక్తులకు దర్శనాలు కల్పిస్తున్నారు. గత నెలలో ఆలయాన్ని ప్రారంభించినా పనులు పూర్తి కాకపోవడంతో అమ్మవారి దర్శనాలను పునరుద్ధరించలేదు. ఉగాది పర్వదినాన దర్శనాలు పునరుద్ధరించేందుకు శరవేగంగా పనులు చేపట్టినా మెట్ల మార్గం పటిష్టపర్చేందుకు మరో నాలుగైదు రోజులు పడుతుంది. దీంతో లాంఛనంగా దర్శనాలను పునరుద్ధరించి, ఈ నెల 15 నుంచి ప్రధానాలయంలో అమ్మవారి దర్శనాలను కొనసాగించనున్నారు. అనంతరం బాలాలయంలో అమ్మవారి దర్శనాలను నిలిపివేయనున్నారు. 15న అమ్మవారి పంచలోహ విగ్రహాలను పునఃప్రతిష్ఠించి, కుంకుమ పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ తెలిపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం పది గంటలకు అమ్మవారి సన్నిధిలో పంచాంగ పఠనం నిర్వహిస్తున్నామన్నారు.

### 11న జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఈ నెల 11న జిల్లా స్థాయి ఓపెన్ విభాగంలో డెవలప్ చెస్ అకాడమీ ఆధ్వర్యాన చెస్ ఓపెన్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ కార్యదర్శి పి.దివ్యతేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీడిగలోని ఎస్ఎస్ఎంవీ ఫంక్షన్ హాలులో ఈ పోటీలు జరుగుతాయన్నారు. అండర్–7, 9, 11, 13, 15 కేటగిరీల్లో నిర్వహించే ఈ పోటీలకు ఎంట్రీ ఉచితమని తెలిపారు. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.2 వేలు, రూ.1,500, రూ.1,000, రూ.700, రూ.500 చొప్పున నగదు బహుమతులు అందజేస్తారని వివరించారు. ఆసక్తి ఉన్నవారు 807 4545 696 నంబరులో సంప్రదించాలని దివ్యతేజ కోరారు.

# సూపర్ సిక్స్.. అట్టర్‌ఫ్లాప్ ఫిక్స్

- గతంలో ఒక్క హామీ నిలబెట్టుకోని చంద్రబాబు
- గాలిలో కలిసిన రైతు రుణమాఫీ
- డ్వాక్రా రుణమాఫీదీ అదే తీరు
- ఇంటికో ఉద్యోగం వట్టి మాటే
- తాజాగా ఆరు హామీలు అంటే నమ్మేదెవరంటున్న జనం



సాక్షి ప్రతినిధి, కాకినాడ: అధికారం కోసం ఎడాపెడా హామీలిచ్చేయడం.. ఆనక గాలికొదిలేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఇలానే 2014లో అలవి కాని హామీలు 650 వరకూ ఇచ్చేసి.. గద్దెనెక్కిన తరువాత వాటిని తుంగలో తొక్కేసిన ఆయన.. మేక వన్నె పులిలా.. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి వస్తూ సూపర్ సిక్స్ పేరిట గుప్పిస్తున్న హామీలు ఏవిధంగా నమ్ముతామని ప్రజలు పెదవి విరుస్తున్నారు. 2014 ఎన్నికల్లో రైతు, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని, ఏ ఒక్కరూ రుణ వాయిదాలు చెల్లించవద్దని చంద్రబాబు ఢంకా బజాయించి మరీ చెప్పారు. బంగారం తనఖా పెట్టి తీసుకున్న రుణాలు కూడా చెల్లించవద్దని, తాను అధికారంలోకి రాగానే వాటిని విడిపిస్తానని గొప్పగా చెప్పారు. చంద్రబాబు మాటలు అమాయకంగా నమ్మిన చాలామంది తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించలేదు. చివరకు రుణ భారం తడిసి మోపెడై, బ్యాంకుల నుంచి నోటీసులు కూడా అందుకుని అవమానాల పాలైన రైతులు, డ్వాక్రా మహిళలు లబోదిబోమన్నారు. తనఖా పెట్టిన బంగారం బ్యాంకుల నుంచి ఇంటికి వచ్చేస్తుందని నమ్మి మోసపోయారు.

**రైతులకు 'బాబు'గారి జెల్ల**

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో లక్ష మందికి పైగా రైతులు సహకార, వాణిజ్య బ్యాంకుల నుంచి ఏటా రూ.3,290 కోట్ల రుణాలు తీసుకుంటారు. వారికి రూ.లక్ష వరకూ రుణమాఫీ చేస్తామని 2014 ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. చివరకు అరకొరగా రూ.25 వేల లోపు మాత్రమే చేసి, మధ్యలోనే వదిలేసి, రైతులను నిలువునా ముంచేశారు. అటువంటి చంద్రబాబు ఇప్పుడు ఇస్తున్న హామీలను ఏవిధంగా నమ్మాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.

**డ్వాక్రా మహిళలను మోసం చేశారిలా..**

చంద్రబాబు 2014 ఎన్నికల ముందు డ్వాక్రా సంఘాల మహిళలకు రుణమాఫీ ప్రకటించారు. అది నమ్మి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 1,10,336 స్వయం సహాయక సంఘాల్లోని 10,71,078 మంది మహిళలు అప్పటికి తమపై ఉన్న రూ.1,07,107 కోట్ల రుణాలు మాఫీ అయిపోతాయని సంబరపడ్డారు. తీరా గద్దెనెక్కిన తర్వాత చంద్రబాబు చిల్లిగవ్వ కూడా మాఫీ చేయకుండా దగా చేశారు. దీంతో ఆయనకు ఓట్లేసి మోసపోయామని డ్వాక్రా మహిళలు మండిపడ్డారు. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికలకు రెండు నెలల ముందు పసుపు – కుంకుమ పేరిట ప్రతి డ్వాక్రా మహిళకు మూడు విడతలుగా (రూ.2,500, రూ.3,500, రూ.4,000) రూ.10 వేలు ఇస్తామని ప్రకటించారు. తీరా దానిని కొంతమందికే పరిమితం చేశారు. అది కూడా రూ.2,500, రూ.3,500 మాత్రమే బ్యాంకుల్లో జమ చేశారు. మిగిలిన రూ.4 వేలకు చెక్కులు ఇచ్చి ఏప్రిల్ చివరిలో మార్చుకోవాలని సూచించారు. ఇంతలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆ చెక్కులు కాస్తా చెల్లుబాటు కాకుండా పోయాయి. వాటిని మహిళలు చిత్తుకాగితాల్లా చెత్తబుట్టలో వేయాల్సి వచ్చింది.

**నిరుద్యోగులకు కుచ్చుటోపీ**

2014 ఎన్నికల సమయంలో ఇంటికో ఉద్యోగం అని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఉద్యోగం ఇచ్చేంత వరకూ నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి, కొంత మందికి మొక్కుబడిగా రూ.1,000 చొప్పున వేసి చేతులు దులిపేసుకున్నారు. ఇంకా కాపులకు రిజర్వేషన్, ముస్లింలకు ప్రధాన నగరాల్లో హజ్ హౌస్‌లు నిర్మిస్తామంటూ ఇచ్చిన హామీలను కూడా చంద్రబాబు గాలికొదిలేశారు. ఇలా అప్పట్లో ఆయన ఇచ్చిన హామీల్లో దేనినీ నెరవేర్చకుండా ప్రజలను నిలువునా వంచించారు. చివరకు టీడీపీ అధికారి వెబ్‌సైట్ నుంచి నాడు ఇచ్చిన మేనిఫెస్టోను సైతం మాయం చేసేశారు. అప్పట్లో ఇన్ని మోసాలు చేసిన చంద్రబాబు.. గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని జనం నిలదీస్తారనే జంకూ గొంకూ లేకుండా ఈ ఎన్నికల వేళ సూపర్ సిక్స్ పథకాలు అంటూ మరోసారి చేస్తున్న ప్రచారాన్ని నమ్మబోమని ప్రజలు స్పష్టంగా చెప్పేస్తున్నారు. కూటమిలోని జనసేన, బీజేపీల తరపున టీడీపీ నుంచి చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలతో ఇస్తున్న నాలుగు పేజీల బుక్‌లెట్‌ను చాలామంది ఏమాత్రం చూడకుండా పక్కన పడేస్తున్నారు. చంద్రబాబు తీరుకు పూర్తి భిన్నంగా గత ఎన్నికల వేళ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం పైగా అమలు చేసిన వైఎస్సార్ సీపీకే తమ మద్దతు అని స్పష్టం చేస్తున్నారు.

### రైతులను నట్టేట ముంచారు



రైతులకు రుణమాఫీ చేస్తామని, అన్నివిధాలా ఆదుకుంటామని 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పారు. ముఖ్యమంత్రి అయిన తరువాత ఆ హామీలు అమలు చేయకుండా నట్టేట ముంచారు. సంపూర్ణ రుణమాఫీ అని చెప్పి, అరకొరగా చేసి నిలువునా మోసగించారు. వ్యవసాయాన్ని దండగ అనే స్థితికి తీసుకువచ్చారు. చంద్రబాబు మాటలను నమ్మే పరిస్థితి లేదు. ఆయన చెప్పేది ఒకటి చేసేది ఒకటి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టి వ్యవసాయాన్ని పండగలా మార్చారు. గోదావరి వరదల నష్టానికి సంబంధించి నాకు రూ.26 వేలు, బీమా, రూ.25 వేల ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చాయి.

– పెదపూడి బాపిరాజు, రైతు సంఘం ప్రెసిడెంట్, వాడపాలెం, కొత్తపేట మండలం

### ఇంటికో ఉద్యోగమని మోసం



తాను అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తానని 2014లో చంద్రబాబు హామీ ఇచ్చి, నిరుద్యోగులను అన్నివిధాలా మోసగించారు. ఉద్యోగం ఇవ్వకపోతే ఉపాధి కల్పిస్తానన్నారు. ఉపాధి దక్కని నిరుద్యోగులకు నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తానని చెప్పి, ఆ హామీని సీఎం అయిన తర్వాత గాలికొదిలేశారు. ఐదేళ్లు ఎదురు చూసినా కనీసం గ్రూపు–1, గ్రూప్–2 నోటిఫికేషన్ సైతం ఇవ్వలేదు.

– అడపా సురేష్, శృంగవృక్షం, తొండంగి మండలం

### చంద్రబాబు మాటలు ఎవరు నమ్ముతారు?



పాత అబద్ధాలతో నిరుద్యోగులను కొత్తగా మోసగించేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. నాడు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించకపోగా నిరుద్యోగ భృతి కూడా పూర్తి స్థాయిలో ఇవ్వకుండా దగా చేశారు. ఒక గ్రామంలో పట్టుమని పది మందికి కూడా ఇవ్వలేదు. ఇప్పుడు ఆయన హామీలను ఎవరు నమ్ముతారు?

– పెంకే రవితేజ, విద్యార్థి జేఏసీ కన్వీనర్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా

### బాబును మహిళలు ఎప్పటికీ నమ్మరు



నాడు ఎన్నికల ముందు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానంటే నమ్మి ఓటేశాం. తీరా అధికారంలోకి వచ్చాక మాఫీ విషయాన్ని చంద్రబాబు గాలిలో కలిపేశారు. కేవలం ఓట్ల కోసం డ్వాక్రా మహిళలను నమ్మించి, మోసం చేశారు. బ్యాంకుల నుంచి తాఖీదులు వస్తే అవమానాలు ఎదుర్కొన్న రోజులు ఇప్పటికీ మరిచిపోలేకపోతున్నాం. అదే జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే డ్వాక్రా రుణాలు మాఫీ చేసి, ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. చంద్రబాబు మాయమాటలను మహిళలు ఎప్పటికీ నమ్మరు.

– చిట్టూరి రాధాభాయ్, డ్వాక్రా మహిళ, పుల్లేటికుర్రు, అంబాజీపేట మండలం

# కార్పొరేట్ గాలం

- టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థుల ఇంటిబాట పట్టిన పీఆర్‌ఓలు
- ఫలితాలు రాక ముందే ఇంటర్ అడ్మిషన్లకు వేట
- నిబంధనలు పాటించని ప్రైవేటు కళాశాలలు

కాకినాడ సిటీ: 'హలో.. నమస్కారమండి. మీ పాప, బాబు పదో తరగతి అయిపోయింది కదండి. ఇంటర్‌కు ఏం ప్లాన్ చేస్తున్నారు? మాది కార్పొరేట్ కాలేజీ. ఐఐటీ, మెయిన్స్, అడ్వాన్స్‌డ్, ఏసీ, నాన్ ఏసీ స్పెషల్ బ్యాచ్‌లున్నాయి. ఇప్పుడు జాయిన్ అయితే డిస్కౌంట్ కూడా ఇస్తున్నాం. రిజల్ట్స్ వచ్చాక సీట్లు ఉండవు. ఫీజులు పెరుగుతాయి. మీ ఇష్టం.. ఆలోచించుకోండి' ఈ తరహా ఫోన్‌కాల్స్ జిల్లాలోని పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రతి రోజూ వస్తున్నాయి. ఇంటర్ కాలేజీల యాజమాన్యాలు ప్రత్యేకంగా పీఆర్‌ఓలను నియమించుకుని మరీ విద్యార్థుల కోసం గాలం వేస్తున్నాయి.

తాము పడిన కష్టాలు తమ పిల్లలు పడకూడదనే సాధారణంగా తల్లిదండ్రులు ఆలోచిస్తారు. కూలీనాలి చేసో, ఆస్తులు అమ్ముకునో మంచి కళాశాలలో చదివించాలని అనుకుంటారు. దీనిని అవకాశంగా తీసుకుని అందినకాడికి దండుకునేందుకు కార్పొరేట్ కళాశాలలు సిద్ధమవుతున్నాయి. ఆకట్టుకునేలా బ్యాచ్‌కో పేరు పెట్టి.. రంగురంగుల బ్రోచర్లు చూపి.. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం పదో తరగతి పరీక్షల ఫలితాలు వెలువడిన తర్వాత మే, జూన్ నెలల్లో అడ్మిషన్లు ప్రారంభించాలి. కానీ, దీనికి విరుద్ధంగా ఇంకా టెన్త్ ఫలితాలు రాకముందే కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల వేట ప్రారంభించేశాయి.

**బంపర్ ఆఫర్లతో..**

ఆయా కళాశాలలు నియమించుకున్న పీఆర్‌ఓలు ఇప్పటికే టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థుల ఇళ్ల వద్దకు క్యూ కడుతున్నారు. మూడు నెలల ముందు నుంచే ఈ తతంగం మొదలైంది. వీరు ఆయా పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల వివరాలు, ఫోన్ నంబర్లు, చిరునామా ఇప్పటికే సేకరించారు. వివరాలు ఇచ్చినందుకు ఆయా పాఠశాలల యాజమాన్యాలకు విందులు, నజరానాలు అందిస్తున్నారు. నిబంధనల ప్రకారం విద్యార్థుల వివరాలు ఎవ్వరికీ ఇవ్వరాదు. కానీ కాసులకు కక్కుర్తిపడి కొన్ని ప్రైవేటు పాఠశాలలు ఈవిధంగా వ్యవహరిస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన పలు కళాశాలల వారు జిల్లాలో 50 మంది వరకూ పీఆర్‌ఓలను నియమించుకున్నారు. వారు ఉదయం నుంచి రాత్రి వరకూ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి బ్రోచర్లు ఇవ్వడం, వారి కళాశాలల్లో బోధన, వసతులు, ఏసీ క్యాంపస్‌లు, ఆఫర్లు తదితర విషయాలు వివరించడం ద్వారా వారిని ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు.

**టార్గెట్ పెడుతూ..**

కొన్ని యాజమాన్యాలు పీఆర్‌ఓలను ప్రత్యేకంగా నియమించుకుని ఏడాది పాటు వేతనాలు ఇస్తున్నాయి. ఎక్కువ అడ్మిషన్లు చేసిన వారికి ఇన్సెంటివ్‌లు సైతం అందిస్తున్నాయి. మరోవైపు ఆయా కళాశాలల్లోని బోధన, బోధనేతర సిబ్బందికి సైతం ఒక్కొక్కరికి 25 చొప్పున అడ్మిషన్లు తీసుకుని రావాలని టార్గెట్లు పెట్టారు. వేసవిలో తరగతులు ఉండకపోవడంతో వారికి సగం వేతనమే చెల్లిస్తున్నారు. అడ్మిషన్లు తెచ్చిన వారికి మాత్రం ఇన్సెంటివ్, కొంత కమిషన్ ఇస్తున్నారు. లెక్చరర్లు, ఇతరులు ఎవరైనా అడ్మిషన్లు చేస్తే సాధారణ కళాశాలకు రూ.వెయ్యి, కార్పొరేట్ కళాశాలకు రూ.5 వేల వరకూ, హాస్టల్ క్యాంపస్ ఉన్న కళాశాలల్లో చేర్పిస్తే రూ.2,500 వరకూ అందజేస్తున్నారు. అయితే, ఈ డబ్బంతా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నదే కావడం గమనార్హం.

**భారీగా ఫీజులు**

జిల్లాలో కార్పొరేట్ కళాశాలల్లో ఏటా 5 వేల నుంచి 8 వేల మంది వరకూ విద్యార్థులు అడ్మిషన్లు పొందుతున్నారు. ఐఐటీ, నీట్, ఏసీ సౌకర్యాలున్న కళాశాలల్లో ఏడాదికి రూ.3 లక్షలు, సాధారణ చదువుకు రూ1.50 లక్షల వరకూ వసూలు చేస్తున్నారు.

### ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించండి



ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన లెక్చరర్ల ఆధ్వర్యాన నాణ్యమైన విద్య అందిస్తున్నారు. తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలి. అడ్మిషన్లతో పాటు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు సైతం ఉచితంగా అందిస్తున్నారు. స్కాలర్‌షిప్ కూడా పొందవచ్చు.

– పిల్లి రమేష్, జిల్లా విద్యాశాఖాధికారి



# ఉపాధి పనులు అన్నిచోట్లా జరగాలి

కాకినాడ సిటీ: జిల్లాలోని అన్ని ఆవాసాల్లోనూ ఉపాధి హామీ పథకం పనులు జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ జె.నివాస్ ఆదేశించారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి ఆయన పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ, లక్ష్యానికి అనుగుణంగా ఉపాధి పనుల్లో పురోగతి కనబరచాలన్నారు. రోజువారీ వేతనం రూ.272 నుంచి రూ.300కు పెరిగినందున కూలీల సంఖ్య, పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉపాధి కూలీలు వడదెబ్బకు గురి కాకుండా పని సమయం ఉదయం 6 నుంచి 10 గంటల వరకూ ఉండేలా చూడాలన్నారు. పని ప్రదేశాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో తాగునీరు సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ డి.తిప్పేనాయక్, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డీపీఓ కె.భారతి సౌజన్య, ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ జి.ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం.శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం

కడియం: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం సుమారు అరవై ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొనడంతో మృతి చెందాడని రైల్వే పోలీస్‌లు తెలిపారు. మృతుడి ఒంటిపై చింతపిక్క రంగుపై పసుపురంగు నిలువుచారల పైజామా, పొడుగు చేతుల చొక్కా, నలుపురంగు టెరికాటన్ లోయర్‌ప్యాంట్ ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఈ మేరకు రైల్వే పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే రైల్వే పోలీస్ స్టేషన్ 0883 2442821, 9491003239 నంబర్లకు సమాచారం ఇవ్వాల్సిందిగా వారు కోరారు.



# ఆరుగాలానికి ఆరు రుచుల స్వాగతం

- నేడు శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది
- కోపాన్ని, ద్వేషాన్ని జయించి, ప్రేమతో ముందుకు సాగాలంటున్న పండితులు
- ఉగాది పచ్చడిలో ఆరోగ్య రహస్యాలు

**కొత్తపేట/ సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం):** శ్రీ శోభకృత్ నామ సంవత్సరాన్ని పూర్తిచేసుకుని మంగళవారం నుంచి శ్రీక్రోధి నామ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం. అరిషడ్ వర్గాలలోని క్రోధానికి సంబంధించిన శ్రీక్రోధినామ సంవత్సరం అంతా సహనంతో, ఓర్పుతో క్రోధానికి అతీతంగా ఉండాలని సూచించడమే ఈ నామ సంవత్సరం ప్రత్యేకత. తెలుగు వారి పండగల్లో అతి ముఖ్యమైనది ఉగాది. మామిడి తోరణాలు, ఉగాది పచ్చడి, పంచాంగ పఠనం, కవి సమ్మేళనాలు, అవధానాలు, కమ్మనైన పిండి వంటల రుచులు ఉగాది పండగ ప్రత్యేకతలు. జీవితంలో కష్టసుఖాలు, సంతోషాలు, దుఃఖాలు, భావావేశాలు, ప్రేమానురాగాలకు ప్రతీకగా భావించే ఉగాది పచ్చడిని రుచి చూడని తెలుగు ప్రజలు ఉండరంటే అతిశయోక్తి కాదు. నేడు ఉగాది సందర్భంగా పండగ విశిష్టతను తెలుసుకొందాం.

**తెలుగు సంవత్సరానికి ఆది ఉగాది**

ఉగాది నుంచే తెలుగు సంవత్సరం ప్రారంభమవుతుంది. తెలుగు సంవత్సరం చైత్రమాసం పాడ్యమి తిథి నుంచి ప్రారంభం కాగా ఆంగ్ల సంవత్సరం జనవరి ఒకటో తేదీ నుంచి ప్రారంభమవుతుంది. ఉగాదికి ఎంతో ప్రాధాన్యం వుంది. దీని ప్రభావం, సందడి గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కనిపిస్తుంది. ఉగాదికి ఇళ్లను శుభ్రం చేసుకుని, ఇంటి వాకిళ్లను రంగవల్లులతో అలంకరిస్తారు. గుమ్మాలకు మామిడి తోరణాలు కడతారు. ఇంటిల్లిపాదీ కొత్త దుస్తులు ధరించి నిండుదనాన్ని తెస్తారు. అనంతరం ఆలయాలను సందర్శిస్తారు. ఏడాది పొడవునా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, తలపెట్టిన పనులన్నీ సజావుగా పూర్తి కావాలని తమ ఇష్టదైవాలను కొలుస్తారు. అనంతరం ముందుగా ఉగాది పచ్చడి తింటారు.

**తీపి–చేదుల కలబోత పచ్చడి**

ఉగాది పేరు తలవగానే గుర్తుకు వచ్చేది ఉగాది పచ్చడి. షడ్రుచుల సమ్మేళనంగా తయారయ్యే ఈ పచ్చడిలో ఉపయోగించే వేప పువ్వు ఈ రోజుల్లోనే పూస్తుంది. మామిడిరాయలు గుత్తులు గుత్తులుగా కాస్తాయి. తీపి, కారం, చేదు, ఉప్పు, పులుపు, వగరు ఆ పచ్చడిలో కలుస్తాయి కనుకనే దీన్ని షడ్రుచుల సమ్మేళనం అంటారు.

**పంచాంగ పఠనం**

ఉగాది నాడు ‘పంచాంగ పఠనం’ నిర్వహించడం ఓ ప్రత్యేకత. తెలుగు సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పలు సంస్థలు, దేవస్థానాలు, ప్రముఖులు పండితులతో పంచాంగ పఠనం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో జన్మ నక్షత్రం లేదా నామ నక్షత్రం ఆధారంగా వ్యక్తిగత జీవిత అంశాలు, వారి ఆదాయ, వ్యయాలతో పాటు సమాజం, రాష్ట్రం, దేశం పోకడలు, రాజకీయాలు తదితర అంశాలను విశ్లేషిస్తూ పంచాంగ పఠనం చేస్తారు. ఆ సందర్భంగా దాదాపు ప్రతీ ఒక్కరూ తమ జాతక ఫలితాలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతారు.

**గ్రామ దేవతల తీర్థాలు**

గ్రామ దేవతల తీర్థాలు ఉగాది పర్వదినం సందర్భంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రసిద్ధి చెందిన అమ్మవార్ల, గ్రామ దేవతల ఉత్సవాలు, తీర్థాలు జరుగుతాయి. ఉగాది కవి సమ్మేళనం, సాహితీ సభలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. రైతులు ఎద్దులతో నాగలి కట్టి దుక్కి దున్ని ఏరువాక కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రస్తుతం యాంత్రీకరణతో ఎద్దులు, నాగళ్లు కనుమరుగయ్యాయి. దానితో రైతులు గునపంతో మట్టి పెకలించి ఏరువాక చేస్తున్నారు.

### తెలుగు వారికి ప్రధానమైనది ఉగాది



తెలుగు ప్రజలకు సంవత్సరాది ఉగాది పండగే. రుతువులను అనుసరించి ఈ ఏడాది శ్రీ క్రోధి నామ సంవత్సరం. ఉగాది నుంచే తెలుగు సంవత్సరం మొదలవుతుంది కనుక ఇది తెలుగు వారి మొదటి పండగ. ఈరోజు నుంచి వసంత నవరాత్రులు ప్రారంభమవుతాయి. ఆ రోజున పంచాంగ శ్రవణం వల్ల మహా ఫలితం కలుగుతుంది. ప్రతీ ఒక్కరి జీవితంలో కష్ట, సుఖాలకు తార్కాణంగా తీపి, చేదుల కలబోత అయిన ఉగాది పచ్చడిని స్వీకరించడం సంప్రదాయంగా వచ్చింది. ప్రతీ తెలుగు కుటుంబం ఈ ఉగాది పండగను విధిగా జరుపుకోవాలి. ఈ శ్రీ క్రోధి నామ సంవత్సరం అందరి జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలి.

–పిదపర్తి రవికుమార్‌శర్మ, వేద పండితులు, పలివెల, కొత్తపేట మండలం

### కొత్త ఆశలకు, ఆశయాలకు పునాది



కాలంలో వచ్చే మార్పులకు ఇది నాంది. మోడువారిన ప్రకృతి చిగురించే కాలం ఇది. జీవితంలో కొత్త ఆశలకు, ఆశయాలకు పునాది ఈ ఉగాది. ఇది తెలుగుజాతికి విశేషమైన పండగ. అందుకే కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వర స్వామికి కూడా ‘ఉగాది ఆస్థానం’ పేరుతో ఉత్సవం నిర్వహిస్తారు. మావిచిగురులు తిన్న గండుకోయిల ఎలా అయితే చక్కని కూతతో సంగీతాన్ని వినిపిస్తుందో, కవి కోకిలలు కూడా తమ గళాన్ని విప్పి కవితలు, పద్యాలు పాటలు రచించి గానం చేయడం ఉగాది సంప్రదాయం.

– డాక్టర్ తాతా సందీప్ శర్మ, శతావధాని, ప్రవచన కర్త


షడ్రుచుల ఉగాది పచ్చడి

### మీ చేతిలో... మీ ఛాతిలో...



క్రోధి నవ ఉగాదిలో కోపాలు, ఆవేశాలు ఎక్కువనీ, భిన్నాభిప్రాయాలు, యుద్ధాలు జరుగుతాయని పండితులు చెబుతున్నారు. ప్రశ్నాపత్రం, సిలబస్ తెలిసిన వాడికి పరీక్ష రాయడం తెలియదా!? ఆదాయం తక్కువ ఖర్చు పొదుపుగా పెట్టుకుందాం. ఖర్చు ఎక్కువ అన్నారనుకోండి. బంగారం కొనుక్కుందాం. కోపంతో గొడవలు వస్తాయని తెలిస్తే తగ్గించుకుందాం. యోగా చేద్దాం! భగవంతుడు రాసిన రాతను భగవంతునికి పూజలు జరిపి పరిహారం చేద్దాం. పరిసరానుగుణ్యతతో మారే కీటకాలకున్న తెలివితేటలు మనకు లేవా!? అవి శత్రువుల నుంచి రక్షించుకోవడానికి చెట్లు, ఆకులు రంగులలోకి మారుతున్నాయి. ప్రాణాలు కాపాడుకుంటున్నాయి. ఆ మాత్రం విజ్ఞత మనకు లేదా! మీ భవిష్యత్తు మీ చేతిలో, నీతిలో ఉన్నది. ధైర్యం మీ ఛాతిలో ఉంది. ఇక విజయం మీదే!

–డాక్టర్ బీహెచ్.వి.రమాదేవి

### తెలుగు వారి పండగ ఉగాది



కాలంలో వచ్చే ఈ తొలి మార్పే ఉగాది. తెలుగు వారంతా గొప్పగా జరుపుకునే పండుగ ఈ ఉగాది పండగ. మనసుకు అధిపతి అయిన చాంద్రమానాన్ని ప్రమాణంగా స్వీకరించి దాని ఆధారంగా ఈ పండగను జరుపుకోవడం తెలుగువారి ఆనవాయితీ.

– నర్తన రుషి, డాక్టర్ సప్పాదుర్గా ప్రసాద్

### ఉగాది పచ్చడిలో ఆరోగ్య రహస్యం



ఉగాది పచ్చడి రుచులలో ఒక్కోదానికి ఒక్కో అర్థం ఉంది. ఉప్పు – మన జీవితంలో ఆనందం, రుచికి సంకేతంగా పరిగణిస్తారు. పులుపు – తెలివిగా వ్యవహరించాల్సిన పరిస్థితులను తెలియజేస్తుంది. చేదు – బాధను దిగమింగాలని లేదా భరించాలని సూచిస్తుంది. తీపి – సంతోషానికి ప్రతీక. కారం – సహనం కోల్పోవడాన్ని సూచిస్తుంది. వగరు – పచ్చి మామిడి ముక్కల్లో తగిలే ఈ రుచి కొత్త సవాళ్లను ఎదుర్కోవడం గురించి తెలియజేస్తుంది

– డాక్టర్ పీవీబీ సంజీవరావు, తెలుగుశాఖాధిపతి



# జగన్‌ను సీఎం చేసేందుకు కృషి చేయాలి

- రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు జగన్‌తోనే సాధ్యం
- గడచిన ఐదేళ్లలో ఆయన అపార అనుభవం పొందారు
- సినిమా వాళ్లను నమ్మడానికి జనం సిద్ధంగా లేరు
- కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం

**కిర్లంపూడి:** జగన్ సీఎంను చేసేందుకు అహర్నిశలూ కృషి చేయాలని కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. పిఠాపురం నియోజకవర్గం పిఠాపురం, గొల్లప్రోలు రూరల్ మండలంలోని పలు గ్రామాల నుంచి దళిత నాయకులు భారీ సంఖ్యలో కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి వచ్చి ఆయనను, యువ నాయకుడు ముద్రగడ గిరిబాబును సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల రాజకీయ పాలనలో సీఎం జగన్ అపార అనుభవం పొందారన్నారు. రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి గుండెల్లో ఆశజ్యోతిగా జగన్ సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. మరిన్ని సంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం అవుతుందన్నారు. పిఠాపురం నియోజకవర్గం అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం అన్నారు. ఆరునెలలకోసారి వచ్చి కనబడిపోయే సినిమా హీరో పవన్ కళ్యాణ్‌ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. రానున్న ఎన్నికల్లో తమ ఇంట్లో కుటుంబ సభ్యుడు వార్డు మెంబర్, ప్రెసిడెంట్‌గా పోటీ చేస్తే గెలిపించుకోవడానికి ఎలా కృషి చేస్తారో అలాగే కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను, పిఠాపురం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతను గెలిపించి వైఎస్ జగన్‌ను సీఎం చేయాలని కోరారు. మీ బంధువులు రాష్ట్రంలో ఏ మూలన ఉన్నా వైఎస్సార్ సీపీకి ఓటు వేయించాలని వారికి సూచించారు. కష్టకాలంలో పార్టీ విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తుపెట్టుకుంటుందన్నారు.


కిర్లంపూడిలో పిఠాపురం నియోజకవర్గ దళిత నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ముద్రగడ

**ముద్రగడ ఆధ్వర్యంలో పార్టీ విజయం ఖాయం**

రాజకీయాల్లో అనుభవం ఉన్న ముద్రగడతో నడిచేందుకు మేము సిద్ధంగా ఉన్నామని దళిత నాయకులు తెలిపారు. ఆయన వైఎస్సార్ సీపీలోకి రావడంతో పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ముద్రగడ సారథ్యంలో శక్తివంచన లేకుండా పార్టీ విజయానికి కృషి చేస్తామని అన్నారు.

# అక్రమ రవాణాపై నిఘా

**పట్టుబడ్డ నగదు, మద్యం**

**అమలాపురం టౌన్:** ఎన్నికల సందర్భంగా జిల్లాలో అక్రమ రవాణాపై నిఘాను జిల్లా పోలీసు శాఖ ఎస్ఈబీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ ద్వారా విస్తృత తనిఖీలతో మద్యం, నగదును స్వాధీనం చేసుకుంటోంది. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు శాఖ ఈ తనిఖీల దూకుడును మరింత పెంచింది. జిల్లాలోని చెక్ పోస్టులు తదితర ప్రాంతాల్లో నిఘా బృందాలు ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడ్డ నగదు, మద్యం వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఐ.పోలవరం పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 3 ఎన్‌డీపీ మద్యం సీసాలు, 0.99 లీటర్ల ఐఎంఎల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ద్రాక్షారామ, అంగర, పామర్రు, రాయవరం పోలీసు స్టేషన్ల పరిధిలో 7 కేసులకు సంబంధించి తొమ్మిది మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 9 ఎన్‌డీపీ మద్యం సీసాలు, 7.54 లీటర్ల ఐఎంఎల్, ఒక కారు, 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ద్రాక్షారామ, రాయవరం పోలీసు స్టేషన్ల పరిధిలో పేకాట ఆడుతున్న 10 మంది వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.11,470 నగదును సీజ్ చేశారు. అమలాపురం, ముమ్మిడివరం, ఆలమూరు, రామచంద్రపురం, కొత్తపేట పోలీసు స్టేషన్ల పరిధిలో ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 8 ఎన్‌డీపీ మద్యం సీసాలు, 16.33 లీటర్ల ఐఎంఎల్, 60 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఏడు కేసులు నమోదు చేశారు. రావులపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో రూ.1.30 లక్షలు, ద్రాక్షారామ పోలీసు స్టేషన్ పరిధిలో రూ.1.98 లక్షల నగదు సీజ్ చేశారు. జొన్నాడ, బొబ్బర్లంక, దిండి, ఎదుర్లంక, నరసాపురపుపేటల వద్ద ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద వాహనాలను ఆపి విస్తృత తనిఖీలు చేశారు. ఎన్నికల క్రమంలో సమస్యాత్మక గ్రామాలైన అల్లవరం పోలీసు స్టేషన్ పరిధిలోని మొగలమూరు, సిరగట్లపల్లి, రెబ్బనపల్లి, ద్రాక్షారామ పోలీసు స్టేషన్ పరిధిలోని కాపవరం, వెల్ల గ్రామాల్లో ఆయా పోలీసు స్టేషన్ల అధికారుల కేంద్రం నుంచి వచ్చిన బలగాలతో సోమవారం సాయంత్రం కవాతు నిర్వహించారు. ఓటును నిర్భయంగా వేయాలని, అందుకు పోలీసులు భరోసాగా ఉంటారని సీఐలు, ఎస్సైలు అవగాహన కల్పించారు.


అల్లవరం మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు



# తల్లి అడ్డుపడినా మృత్యు ఒడికి

**గోదావరిలో స్నానానికి వెళ్లి యువకుడి దుర్మరణం**


బర్నికల అశోక్ కుమార్ (ఫైల్)

**ధవళేశ్వరం/కడియం:** ఇంటికి ఆధారమైన కన్నకొడుకు ఈత సరదాతో గోదావరికి స్నానానికి వెళతానంటే ఆ తల్లి మనసు ఎందుకో కీడు శంకించింది. వద్దు నాయనా అని బతిమాలింది. అయినా తల్లికి తెలియకుండా స్నేహితులతో కలిసి ధవళేశ్వరం వద్ద గోదావరిలో స్నానానికి వెళ్లి కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన బర్నికల అశోక్‌కుమార్ (18) మృత్యువాత పడ్డాడు. తాను వద్దని మొత్తుకున్నా.. తెలియకుండా వెళ్లిపోయాడని.. తెలిసుంటే కొడుకును ఆపుకునేదానిని అతడి తల్లి మీనాక్షి కన్నీటి పర్యంతమవుతోంది. ఉన్న ఒక్కగానొక్క కొడుకు ఇలా అర్ధంతరంగా కన్నుమూయడంతో ఆ తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరి తరమూ కావడం లేదు. దుళ్ల గ్రామానికి చెందిన బర్నికల రాజు, మీనాక్షిలకు అశోక్‌కుమార్ ఒక కుమారుడు, ఒక కుమార్తె. తండ్రి రాజు తాపీపనికి వెళ్లేవాడు. అనారోగ్యం కారణంగా పని చేయలేకపోతుండడంతో తొమ్మిదో తరగతిలోనే చదువు మానేసి తాపీ పనికి వెళుతూ కుటుంబాన్ని అశోక్‌కుమార్ పోషిస్తున్నాడు. ఆదివారం కావడంతో తోటి స్నేహితులు ఐదుగురితో కలిసి ఆదివారం సాయంత్రం ధవళేశ్వరం బ్యారేజీ వద్ద స్నానానికి వెళ్లాడు. గోదావరిలో అశోక్‌కుమార్ మునిగిపోవడంతో అతడిని ఒడ్డుకు చేర్చిన స్నేహితులు 108 సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అశోక్‌కుమార్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడు అశోక్‌కుమార్ తండ్రి రాజు ఫిర్యాదు మేరకు ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై శివాజీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


దుళ్లలో అశోక్‌కుమార్ ఇంటి వద్ద విషాదంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులు

**అందొచ్చిన కొడుకు అందనంత దూరానికి..**

సరదాగా గోదావరి స్నానానికి బయలుదేరాడు. విషయం తెలిసి తల్లి ఆరాతీసి.. వద్దు నాయనా అంటూ బతిమాలుకుంది. అలాగేనంటూ కాసేపు ఆగాడు. ఈ లోపు ఆ తల్లి తన పనుల్లో నిమగ్నమైంది. ఇంతలోనే ఎలా వెళ్లిపోయాడో స్నేహితులతో కలిసి గోదావరికి వెళ్లిపోయాడు. వద్దన్నాను కదా వెళ్లడులే అనుకుందా తల్లి. తీరా సాయంత్రానికి గోదావరిలో మునిగి అశోక్‌కుమార్ చనిపోయాడన్న వార్త పిడుగులా ఆమె చెవిన పడింది. దీంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అయ్యయ్యో నా తండ్రీ.. మమ్మల్నొదిలి వెళ్లిపోయావా అంటూ కొడుకు మరణవార్త తెలిసింది మొదలు గుండెలు బాదుకుంటూ కన్నీటి పర్యంతమవుతూనే ఉంది. పేదరికం ఇబ్బంది పెడుతున్నప్పటికీ కొడుకే లోకంగా తల్లిదండ్రులిద్దరూ బతుకుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పుడిప్పుడే చేతికి అందొచ్చాడని, మాకు ఇక ఇబ్బందులేమీ ఉండవన్న ధీమాతో రాజు, మీనాక్షిలు ఉండేవారని, అశోక్‌కుమార్‌ను అకాల మృత్యువు కబళించడంతో వారిని ఓదార్చడం ఎవ్వరి తరమూ కావడం లేదని బంధుమిత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# స్టీల్, సిమెంట్ షాపులో రూ.40 వేల చోరీ

**కొత్తపేట:** స్థానికంగా ఒక స్టీల్ అండ్ సిమెంట్ షాపులో గుర్తు తెలియని దుండగుడు చొరబడి రూ.40 వేల నగదు దొంగిలించుకుపోయిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు అదనపు ఏఎస్సై జీవీ కృష్ణారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం యజమాని ఎస్‌వీవీ సత్యనారాయణ షాపు తెరచి లోపలికి వెళ్లగా వెనుక షట్టర్ తెరచి ఉండటంతో అనుమానం వచ్చి క్యాష్ కౌంటర్ చూడగా దానిలో ఉంచిన రూ.40 వేలు కనిపించలేదు. సీసీ కెమెరా ఫుటేజ్ పరిశీలించగా దుస్తులు లేకుండా బ్లూ కలర్ అండర్ వేర్ వేసుకుని, ముఖానికి బ్లూ కలర్ మాస్క్ పెట్టుకున్న వ్యక్తి లోపలికి ప్రవేశించినట్టు గుర్తించారు. సీసీ కెమెరా వైర్లు తొలగించి చోరీకి పాల్పడినట్టు కనుగొన్నారు. దీనిపై సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రైనీ డీఎస్పీ విశ్వస్వరూప్, రావులపాలెం సీఐ రామ్‌కుమార్, అదనపు ఎస్సై జ్వాలాసాగర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. దీనిపై దర్యాప్తు జరుపుతున్నట్టు ఏఎస్సై కృష్ణారావు తెలిపారు.